క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాగనూర్: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా బైరంపల్లి, నేరడగం దొడ్డి, ఉజ్జెల్లి, తళంకేరి, గురువలింగంపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాలకు రేపు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ దేవేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు, వ్యాపారస్తులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

మక్తల్: ఎస్సీ వర్గీకరణ సాధనకోసం ఆగస్టు 9న ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేపోగు శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని చలో ఢిల్లీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. 30ఏళ్ల నుంచి మాదిగలు ఉద్యమాలు, పోరాటాలు చేసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. అందరు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటేష్, సుతారీ కృష్ణ, నర్సింహులు, దీపక్, బాలకృష్ణ, ఎల్లప్ప, భాస్కర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా జమీల్

మరికల్: మండల తహసీల్దార్‌గా జమీల్ గురువారం బాధ్యతలను చేపట్టారు. మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సునిత వనపర్తికి బదిలీపై వెళ్లారు. మహబూబ్‌నగర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జమీల్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను అధికారులు, పలువురు రాజకీయ నాయకులు సన్మానించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



కృష్ణా: కృష్ణానది ఒడ్డున ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ దయాకర్‌రెడ్డి హెచ్చరికలు జారి చేశారు. గురువారం కృష్ణాలోని పుష్కర ఘాట్‌ను ఆర్ఐ అమర్‌నాథ్ రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ కృష్ణానది ఉధృతి ఉదయం నుంచి పెరుగుతూ వస్తుందని, పుష్కర ఘాట్‌లోని కృష్ణమ్మ విగ్రహం చుట్టూ ఇప్పటికే నీరు చేరడంతో ప్రమాదకరంగా కన్పిస్తుందన్నారు. కాగా ఈ రోజు రాత్రికి 2 లక్షల 50వేల నుంచి 3లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు కర్ణాటక అధికారులు సమాచారమందించినట్లు ఎస్ఐ ఎండీ నవీద్ తెలిపారు. ఏది ఏమైనా అక్కడి అధికారులు సరిహద్దు గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నేడు గ్రామసభ

నర్వ: నేడు మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి బుచ్చారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఓడీఎఫ్ ప్లస్ (బహిరంగ మల మూత్ర విసర్జన, మురుగునీరు, ప్లాస్టిక్ రహిత గ్రామంగా) మార్చుకునేందుకు సమావేశంలో చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.
ధన్వాడ: నేడు ఓడీఎఫ్ ప్లస్ గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రావు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10: గంటలకు గ్రామ సభ ప్రారంభమవుతుందని గ్రామస్తులందరూ పాల్గొనాల్సిందిగా కోరారు.

పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడి నియామకం

నారాయణపేట రూరల్: ఇటీవల అకాల మరణంతో ఖాళీ అయిన స్థానాన్ని పీఆర్టీయూ సంఘం కొత్త నాయకుడితో భర్తీ చేసింది. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా పనిచేసిన ఊట్కూర్ వాసీ ఎం.లక్ష్మారెడ్డి గతనెల 30న గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో ఆయన స్థానంలో నూతన జిల్లా గౌరవ అధ్యక్షుడిగా డి. తిరుపతిని నియమిస్తూ రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంది. సంఘానికి సేవలు చేస్తున్న సందర్భంగా ఆయనను గుర్తించి బాధ్యత అప్పగించిందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి జనార్దన్‌రెడ్డి తెలిపారు.

లారీ, కారు ఢీకొని వృద్ధురాలి మృతి

కృష్ణా: మండల కేంద్రంలోని కున్సి గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం లారీ, కారు ఢీకొన్న ఘటనలో కారులో ఉన్న విమల (66) అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ ఎండీ నవీద్ తెలిపిన వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని గుత్తి నుంచి కర్ణాటకలోని గుల్బర్గా పట్టణానికి కారులో భార్య, భర్తలు విమల, సురేష్ వెళ్తుండగా కర్ణాటకలోని యాద్గీర్ వైపు నుంచి రాయచూర్‌కు వెళ్తున్న ఓ లారీ వారి కారును ఢీ కొట్టడంతో అందులోని మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ నవీద్ అక్కడికి చేరుకొని గాయపడ్డ సురేష్‌తోపాటు మృతిచెందిన మహిళను రాయచూర్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

సోలార్‌పై గృహజ్యోతి ఎఫెక్ట్

- సబ్సిడీ ఇస్తామన్నా.. ముందుకు రాని మహిళలు
- ఆదర్శ గ్రామాల్లోనూ అమలు కాని వైనం



మద్దూర్‌లో ఇంటిపై సోలార్ ప్యానెల్స్

మద్దూరు: విద్యుత్ ఉత్పత్తిలో తరిగిపోతన్న వనరులను కాపాడుకోవడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ ఖర్చుల భారం తగ్గించుకునేందుకు స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు సబ్సిడీతో కూడిన సోలార్ (సౌర) విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు గతేడాది ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముందుగా ఆదర్శ గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులను చైతన్యం చేసి సౌర యూనిట్లను ఏర్పాటుచేసి ఆదర్శంగా ఉండేందుకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో వీటిపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. అలాగే స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ కూడా ఇచ్చారు.

ఏర్పాటు ఇలా..

సుమారు 160నుంచి 200 చదరపు అడుగుల విస్తీర్ణంలో స్లాబ్ కలిగి ఉంటే 2 నుంచి 3 కిలో వాట్ల సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకొని తమ ఇంటి అవసరాలకు పోగా మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేసేవిధంగా టీజీఎస్‌పీడీఎల్ అనుమతితో టీఎస్‌రెడ్‌కో ద్వారా ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు.

స్త్రీనిధి నియమ నిబంధలు..

సోలార్ యూనిట్ల ఏర్పాటుకు స్వయం సహాయక సంఘాలకు స్త్రీనిధి రుణాలతోపాటు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా అందజేస్తుంది. ఈ రుణాలన్నీ స్త్రీనిధి నియమ నిబంధనలతో వడ్డీ 11శాతంతో 60 నెలల్లో చెల్లించే విధంగా రూపొందించారు. జిల్లాలో ఎవరైనా ముందుకు వచ్చినా ఇవ్వడానికి అధికారులు సిద్ధంగా ఉన్న ఇంత వరకు జిల్లాలో ఎక్కడా ఈ ప్రాజెక్టు మొదలు కాలేదు.

'గృహ జ్యోతి'తో సౌర విద్యుత్‌కు దెబ్బ..

ప్రభుత్వం అధికారంలోనికి రాగానే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందజేయడంతో సోలార్ యూనిట్ల ఏర్పాటుకు ఎవరు ముందుకు రావడం లేదు. అసలు ఈ పథకంపై అధికారులు కూడా దృష్టి పెట్టడం లేదు. ఇక గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులను ప్రశ్నిస్తే ఎందుకు మాకు ఉచితంగా కరెంట్ ఇస్తుంటే సోలార్ యూనిట్లను ఎందుకు ఏర్పాటు చేసుకోవాలని చెబుతున్నారు.

సోలార్ యూనిట్లకు సబ్సిడీ ఇలా

కేవి	విలువ (రూపాయల్లో)	సబ్సిడీ	స్త్రీనిధి రుణం
1	83,700	14,558	70,000
2	1,44,000	29,178	1,15,000
3	2,06,400	43,764	1,60,000

'గృహజ్యోతి' ఉందిగా..



ప్రభుత్వం గృహజ్యోతి పథకంలో భాగంగా ఉచిత విద్యుత్‌ను అందిస్తుంటే సోలార్ యూనిట్లను ఎక్కడ ఏర్పాటు చేసుకుంటాం.. సబ్సిడీ, స్త్రీనిధి రుణాలు ఇచ్చినా.. సోలార్ యూనిట్ల ఏర్పాటుచేసుకోం. ఒక వేళ ఏర్పాటు చేసుకుంటే అవి ఎలా ఉంటాయో ఏమో. తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించాలంటే ఎట్లా..?

– భాగ్యమ్మ, గ్రామ సంఘం అధ్యక్షురాలు, కొమ్మూరు

సబ్సిడీ పెంచే యోచనలో ప్రభుత్వం

సోలార్ యూనిట్ల ఏర్పాటుకు జిల్లాలో అన్ని గ్రామాల్లో అవగాహన కల్పించాం. ఎవరూ ఏర్పాటు చేసుకోలేదు. ప్రభుత్వం 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో ముందుకు రావడం లేదు. ప్రభుత్వం సబ్సిడీ పెంచే ఆలోచనలో ఉంది. ఎక్కువగా సబ్సిడీ వస్తే అప్పుడైనా ఏర్పాటు చేసుకొనే విధంగా మహిళలకు అవగాహన కల్పిస్తాం.

– తిరుపతయ్య, స్త్రీనిధి జిల్లా రీజినల్ మేనేజర్, నారాయణపేట

బాలల హక్కులను సంరక్షిద్దాం



అవగాహన కల్పిస్తున్న నర్సింహులు

నారాయణపేట రూరల్: బాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సంరక్షించాల్సిన బాధ్యత ఉందని చైల్డ్ హెల్ప్‌లైన్ కో -ఆర్డినేటర్ నర్సింహులు అన్నారు. మండలంలోని జాజాపూర్ జెడ్పీస్కూల్‌లో గురువారం అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ తప్పకుండా పాఠశాలల్లో ఉండాలని, బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. పిల్లలను పనికి పంపిస్తే తల్లిదండ్రులపైన కేసులు నమోదు చేస్తారని తెలిపారు. అత్యవసర సమయంలో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం భారతి, మధుసూదన్, భాను ప్రకాష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మేడిశెట్టి అవార్డుల ప్రదానం



అవార్డులను అందజేస్తున్న రిటైర్డ్ జీహెచ్‌ఎం రాంప్రకాష్‌గుప్త

మరికల్: పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు గురువారం మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో రిటైర్డ్ జీహెచ్‌ఎం రాంప్రకాష్‌గుప్త మెడిశెట్టి అవార్డులను ప్రధానం చేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో చదివి ప్రతిభ కనబర్చి 9జీపీఏ నుంచి 10జీపీఏ సాధించిన 63మంది విద్యార్థులకు ఎస్ఐ మురళితో కలిసి అవార్డులను అందజేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా మేడిశెట్టి అవార్డులను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు నాగరత్నమ్మ, మానోరంజని, రిటైర్డ్ జీహెచ్‌ఎం సుందరయ్యశర్మ, బాలస్వామి, హన్మంతురెడ్డి, రాజేష్, గోపాల్, నిఖిల్, రవి పాల్గొన్నారు.

రాయల చంద్రశేఖర్ అడుగుజాడల్లో నడుద్దాం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట: రాయల చంద్రశేఖర్ అడుగుజాడల్లో నడుద్దామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి బి. రాము, డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ అన్నారు. గురువారం స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో సంతాప సభలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయన 50ఏండ్లపాటు విప్లవ ఉద్యమంలో ప్రజలకోసం ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు. ఈనెల 16న ట్రైన్ యాక్సిడెంట్‌లో ఆయన మృతిచెందడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సలీం, కాశీశ్వర్, యాదగిరి, కిరణ్, బోయిన్పల్లి రాము, బి. నర్సింహ, భగవంతు, ప్రశాంత్, కొండ నర్సింహులు, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ప్రీ స్కూల్‌పై అంగన్‌వాడీలకు శిక్షణ



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్ రాజేశ్వరి

ధన్వాడ: మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద గురువారం ప్రీ స్కూల్‌పై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులకు పాఠాలు ఏలా బోధించాలి? వారికి ఏలా చెబుతే అర్థమవుతుందని అనే విషయాలను శిక్షణలో తెలియజేశారు. ఆటల రూపంలో చిన్నారులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ రాజేశ్వరి, చంద్రకళతోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు..

వీరారెడ్డి సేవలు మరువలేనివి



మరికల్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నర్వ: డీసీసీబీ మాజీ చైర్మెన్ వీరారెడ్డి సేవలు మరువలేనివని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండలంలో గురువారం ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, బల్‌రాంగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శరణప్ప పాల్గొన్నారు.
మరికల్: మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో డీసీసీబీ మాజీ చైర్మెన్ వీరారెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు.. పేద ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు వీరన్న, ఆనంద్‌కుమార్, కృష్ణయ్య, అంజిరెడ్డి, రాములు, గోవర్ధన్, శివ, వెంకటేష్, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో లాభాలు



ఊట్కూరు: ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు ఉన్నాయని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సాయిబాబా అన్నారు. గురువారం మండలంలోని అమీన్‌పూర్‌లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై ఆయిల్‌పాం మొక్కలను అందించడం జరుగుతుందని అన్నారు. రైతులను ప్రోత్సహించడానికి సబ్సిడీపై డ్రిప్‌ను అందిస్తుందని, 5 ఏళ్లలోపు రైతులకు దిగుబడి ప్రారంభం అవుతుందని వివరించారు. ఆయిల్‌పాం సాగు విధానం, లాభాలు తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్, హఫీజ్, రైతులు వెంకటయ్య, నర్సింహులు, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మాగనూర్: మండల పరిధిలోని ప్రభుత్వ వసతిగృహంలో పనిచేస్తున్న నాల్గో తరగతి సిబ్బందికి అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారిణి నాగజ్యోతి అన్నారు. ఈ మేరకు.. గురువారం మండలంలోని కస్తుర్బా బాలికల వసతి గృహంలో సీజనల్ వ్యాధుల నేపథ్యంలో భాగంగా విద్యార్థులకు టీబీ పరీక్షలు చేశారు. ఈ మేరకు.. విద్యార్థులు, సిబ్బంది తప్పకుండా వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యాధికారిణి రాణితేజశ్విని, ఎల్‌టీ రాఘవేంద్ర, ఏఎన్‌ఎం సుధారాణి, హాస్టల్ వార్డెన్‌లు అబ్దుల్ అహ్మద్, వనిత, రాధిక, ఆశాకార్యకర్తలు రేణుక, కృష్ణవేణి, సరిత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మెడికల్ క్యాంప్

ధన్వాడ: మండలంలోని కస్తుర్బాగాంధీ పాఠశాల, తెలంగాణ మోడల్ పాఠశాలలో గురువారం ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్‌లను నిర్వహించారు. ఉపాధ్యాయులకు సిబ్బందికి రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, మునిర్‌హమ్మద్, ఎంపీహెచ్‌ఓ కతలప్ప, ఎల్‌టీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ కార్యవర్గ సమావేశం

నర్వ: మండల బీజేపీ పార్టీ కార్యవర్గ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశానికి మండల బూత్‌స్థాయి అధికారులు, మండల నాయకులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుంటాం

నారాయణపేట రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఏబీవీపీ ముందు వరసలో ఉంటుందని ఆ సంఘం పాలమూరు యూనివర్సిటీ అధ్యక్షుడు కృష్ణకుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ, శ్రీసాయి జూనియర్ కళాశాలలో గురువారం ఆ సంఘం నూతన కమిటీలను జిల్లా కన్వీనర్ నరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తుందని, ప్రభుత్వ విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తుందని దుయ్యబట్టారు. విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో చరణ్‌రెడ్డి, వెంకటేష్, ఓంకార్, నవీన్, సిద్ధు, సాయిపూజ, శ్రీజ, సిద్ధు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తుల ఆహ్వానం



కోస్గిలో దరఖాస్తులు తీసుకుంటున్న వ్యవసాయ శాఖ అధికారులు



చేగుంటలో..

కోస్గి: ఈ ఏడాది కొత్తగా పట్టా పాసు బుక్కులు పొందిన రైతులతోపాట గతంలో తమ పేర్లు నమోదు చేసుకోని వారు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రామకృష్ణ సూచించారు. ఈ మేరకు గురువారం చంద్రవంచ క్లస్టర్ పరిధిలోని ఏఈఓ అజయ్‌తో కలిసి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కొత్తగా భూమి పట్టా పాసు బుక్కులు పొంది ఉంటే ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, నామిని ఆధార్ జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ అజయ్‌తోపాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.
కృష్ణా: మండలంలోని చేగుంట రైతు వేదికలో గురువారం అర్హులైన రైతుల నుంచి వ్యవసాయ అధికారులు సుదర్శన్‌గౌడ్, సునిల్‌కుమార్ దరఖాస్తులు స్వీకరించారు. వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది కొత్తగా పట్టాపాసు బుక్కులు పొందిన రైతులతోపాట గతంలో తమ పేర్లు నమోదు చేసుకోని వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న యూసుఫ్‌తాజ్

నారాయణపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యూసుఫ్ తాజ్ ఆధ్వర్యంలో దర్గా వద్ద ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి దిశానిర్దేశంతో పర్యావరణ పరిరక్షణ కోసం, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పకుండాగా తమ ఇండ్లలో, పరిసరాల్లో మొక్కలు నాటి పర్యావరణ రక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహిమూద్ ఖురేషి, కాంగ్రెస్ నాయకులు వై.వెంకటయ్య, ఫకృద్దీన్, వై. రవికిరణ్, హనీఫ్ ఖురేషి, జమాలుద్దీన్, యూసుఫ్, జహీర్, జైను తదితరులు పాల్గొన్నారు.

మండల సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మాగనూర్: మండల పరిధిలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందించారు. గురువారం ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారెమ్మవ్వ ఆలయాన్ని భారత్‌మాల రహదారిలో భాగంగా తొలగిస్తారని తెలిసిందని, స్పందించి ఆలయం తొలగింపు చేపట్టకుండా మరోపక్క నుంచి భారత్‌మాల రోడ్డును తీసుకెళ్లాలని విన్నవించారు. క్యాక్రమంలో నాయకులు కనకరాజు, జయనంద్‌రెడ్డి, అశోక్‌గౌడ్, కృష్ణయ్య, తిమ్మప్ప, భారత్ తదితరులు పాల్గొన్నారు.
కృష్ణా: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లను నిలపాలని కోరుతూ గురువారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మండల బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గురువారం తాము న్యూ ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ సభ్యురాలు డీకే అరుణకు వినతిపత్రం అందించినట్లు ఆ పార్టీ మండల నాయకులు తెలిపారు. సోమశేఖర్‌గౌడ్, శ్రీనివాసులు, నర్సప్ప, నారాయణ, జయానంద్‌రెడ్డి, అశోక్‌గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి..

మద్దూరు: మండలంలోని నందిపాడ్‌లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంపీఓ రామన్నతో కలిసి ఎంపీడీఓ జయరాములు గురువారం పరిశీలించారు. అక్కడ కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని కమిటీలకు సూచించారు. పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే జీపీ కార్యాలయంలోని రిజిస్టర్లను పరిశీలించారు. సూపరింటెండెంట్ కృష్ణరావు, పంచాయతీ కార్య దర్శి పుష్పలత, ఎఫ్ఏ మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

నారాయణపేట: జూలై 26, 27రెండు రోజులపాటు భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఉమ్మడి మహబూబ్‌నగర్ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ శిక్షణా తరగతులు మహబూబ్‌నగర్ జిల్లాలోని రైస్‌మిల్ అసోసియేషన్ భవనంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ పార్టీరాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనం నేని సాంబశివ రావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

మద్దూరు: హైదరాబాద్ మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహంలో చదువుతున్న ఎనిమిది ఏళ్ల బాలికలపై అత్యాచారం చేసిన నరేష్‌ను కఠినంగా శిక్షించాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాతబస్టాండ్ చౌరస్తాలో మండల దివ్యాంగులు ధర్నా చేపట్టారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లిన వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నరేష్‌ను ఉరితీయాలని డిమాండ్ చేశారు. దాదాపు అరగంటపాటు ధర్నా చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో పోలీసులు ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు రాధ, నర్సింహులు, మొగులప్ప, రాములు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కెంచె శ్రీనివాస్

నారాయణపేట రూరల్: కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి సీఎం రేవంత్ తన మాట నిలబెట్టుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కెంచె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మండల స్థాయి విస్తృత కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఎంపీ ఎన్నికల్లో మండలంలో మంచి మెజార్టీ ఇవ్వడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ వంద రోజుల్లో చేస్తామన్న హామీలను నిలబెట్టుకోలేదని, క్షేత్ర స్థాయిలో ప్రచారం చేసి రేవంత్ రెడ్డి వైఫల్యాలను ప్రజలకు తెలియజెప్పాలన్నారు. కులగణన, రిజర్వేషన్లు 23నుంచి 42శాతానికి పెంపు, రెండోవిడత గొర్రెల పంపిణీ, బీసీ మంత్రిత్వశాఖ తదితర హామీలను నెరవేర్చాలన్నారు. అనంతరం సామూహికంగా తీర్మానం ఆమోదించారు. కార్యక్రమంలో వెంకట్రాంలు, బాల్‌రెడ్డి, రామకృష్ణ, కార్తిక్, చంద్రశేఖర్, ప్రవీణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

షీటీంపై అవగాహన కలిగి ఉండాలి

నారాయణపేట రూరల్: మహిళలు, బాలికలు తప్పకుండా షీటీంపై అవగాహన కలిగి ఉండాలని షీటీం సభ్యులు నమిత అన్నారు. పట్టణంలోని వైదిక పాఠశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, బాలికలతో ఎవరైన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే డయల్ 100, హెల్ప్‌లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేశారు. అదేవిధంగా సైబర్ నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో షీటీం బృంద సభ్యురాలు బాలరాజు, చెన్నయ్య, హెచ్‌ఎం గంగాధర్‌రెడ్డి, పాఠశాల టీచర్లు పాల్గొన్నారు.

